క్లుప్తంగా

కాకినాడ వెళ్లి పింఛను అందజేత

సామర్లకోట: స్థానిక 14వ వార్డు సంగీతరావుపేటకు చెందిన అప్పికొండ గజలక్ష్మి కాలుకు ఆపరేషన్ చేయించుకొని కాకినాడలో కుమారుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. పింఛను తీసుకునే గడువు ముగుస్తుండడంతో వార్డు కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు, వెల్ఫేర్ సెక్రటరీ మేకా జోగారావు బుధవారం కాకినాడ వెళ్లి ఆమెకు పింఛను అందజేసి వచ్చారు.

'ఓలేటి' కుటుంబానికి ఎంపీ పరామర్శ



వాకతిప్ప రాయభాస్కరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ గీత

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప గ్రామానికి చెందిన ఏఐసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఓలేటి రాయభాస్కరరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. కాగా బుధవారం ఆయన కుటుంబాన్ని కాకినాడ ఎంపీ వంగా గీత పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌తో శారీరక, మానసిక ఉల్లాసం

- ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అద్దాల

బోట్‌క్లబ్: ప్రతి రోజు షటిల్ బ్యాడ్మింటన్ ఆడటం వల్ల శారీరక, మానసిక ఉల్లాసం పొందవచ్చునని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అద్దాల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ బ్యాడ్మింటన్ దినోత్సవాన్ని స్థానిక రాంకోస షటిల్ బ్యాట్మింటన్ కోర్టులో బుధవారం నిర్వహించారు. విజేతలను అద్దాల సత్యనారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఠాగూర్, సుధీర్, కాటన్, పద్మరాజు, భాను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తపల్లి: ఉప్పాడ-మూలపేట బీచ్ రోడ్డులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కొండెవరం గ్రామానికి చెందిన వేమగిరి మోసే (62), అతని కుమారుడు రమేష్ బుధవారం ఉదయం మోటార్ సైకిల్‌పై తాపీ పని చేసేందుకు మూలపేట వెళుతున్నారు. ఉప్పాడ-మూలపేట బీచ్ రోడ్డులోని పోన్నాడ శివారు రామన్నపాలెం ఉప్పుటేరు బ్రిడ్జి సమీపంలో గేదెలు అడ్డుగా రావడంతో ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో మోసే తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మోసే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఘర్షణలో వ్యక్తి మృతి

సామర్లకోట: మండల పరిధిలో జి.మేడపాడు శివారులో ఉన్న ఒక ప్రైవేటు కంపెనీలో పని చేయడానికి ఒడిషా నుంచి వచ్చిన జట్టు కూలీ మేస్త్రీ మృతి చెందాడు. ప్రైవేటు కంపెనీలో వెల్డింగ్ పని చేయడానికి ఎనిమిది మంది వచ్చి మేడపాడులో ఉంటున్నారు. కూలీల మేస్త్రి గేదెల సారధిరెడ్డి (47) ఒక కూలీ జగయ్యరెడ్డిని వంట గిన్నెలు శుభ్రం చేయాలని ఆదేశించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో జగ్గయ్యరెడ్డి సారధిరెడ్డిని నెట్టి వేయడంతో రాయిపై పడి తలకు బలమైన గాయం తగిలింది. దాంతో కాకినాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. సీఐ కె.దుర్గాప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ బస్సు యాత్ర

సామర్లకోట: నియోజకవర్గంలో టీడీపీ బస్సు యాత్ర బుధవారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పూర్ణ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పార్టీ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షత వహించారు.

సెల్ఫీలతో మమ..

పెద్దాపురం: టీడీపీ బస్సు యాత్ర సెల్ఫీలతో, పది మంది కార్యకర్తలతో సాదాగా సాగిపోయింది. స్థానిక దర్గా సెంటర్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజా సూరిబాబు రాజు స్వగృహం నుంచి బస్సు యాత్రకు మరిడమ్మ గుడికి వచ్చే సరికి కేవలం 30 మందికి మించి కార్యకర్తలు హాజరుకాకపోవడంపై టీడీపీ అసమ్మతి సెగ మరోసారి తేటతెల్లమైంది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే టిక్కెట్ ఆశిస్తున్న రాజప్ప, బొడ్డు వెంకటరమణ వర్గీయులు తప్పదన్నట్టు యాత్రకు హాజరయ్యారు. దీనికి తోడు కాకినాడ నేతగా పేరొందిన గుణ్ణం చంద్రమౌళికి టిక్కెట్ ఖరారయ్యే అవకాశం ఉందని తెలియడంతో క్యాడర్ ఇటువంటి కార్యక్రమాలకు కాస్త దూరంగానే ఉంటున్నారు.

విద్యార్థుల ఉన్నతికి బాటలు

- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే దొరబాబు
- నియోజకవర్గంలో 25866 మంది విద్యార్థులకు అమ్మఒడి
- 2.17 కోట్లతో నిర్మించిన తరగతి గదుల ప్రారంభం



విద్యార్థుల తల్లులకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: విద్యార్థుల ఉన్నతికి (బంగారు భవిష్యత్‌కు) ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేస్తున్నారని కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నియోజకవర్గస్థాయి జగనన్న అమ్మఒడి కార్యక్రమాన్ని బుధవారం ఎంపీ, ఎమ్మెల్యేలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థుల తల్లులకు నమూనా చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు, బలహీనవర్గాలకు చెందిన పిల్లలకు కార్పొరేట్ విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థుల కోసం పలు పథకాలను ప్రవేశపెట్టారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చివేసి కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో 25,866 మంది విద్యార్థులకు జగనన్న అమ్మఒడి పథకం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. రూ.12 కోట్లతో నిర్మిస్తున్న హోటల్ మేనేజ్మెంట్ కళాశాలతో ఈ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని తెలిపారు.

విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని...

ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ పేదరికంతో విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గతంలో ప్రభుత్వంలో పథకాల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం ప్రజల ఇంటికే పథకాలు అందుతున్నాయన్నారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నాబార్డు నిధులు 2.17 కోట్లతో నిర్మించిన తరగతి గదులను ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనపై విద్యార్థులు ఆలపించిన గీతాలు అలరించాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



కొత్తపల్లి హైస్కూల్‌లో తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబు

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- కొత్త ఇసుకపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



కొత్త ఇసుకపల్లిలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని కొత్త ఇసుకపల్లిలో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. గ్రామస్తులు రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ నిర్ణయాలతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. గత టీడీపీ పాలనలో ప్రజలను దోపిడీ చేయడం, దోచింది పచ్చనేతలకు పంచిపెట్టడం తప్ప సామాన్యులకు చేసిందేమీ లేదన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని ప్రతి గడపలో లబ్ధిదారులు సంతోషంగా చెబుతున్నారన్నారు. ప్రతిఇంటినీ జల్లెడపట్టి మరీ అర్హులను గుర్తించి పథకాలు అందిండం దేశంలో కేవలం వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. స్థానిక రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కొత్త ఇసుకపల్లి, పాత ఇసుకపల్లి సర్పంచులు తమిలిశెట్టి సుబ్బారెడ్డి, సన్నిబోయిన రిబ్కా, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, గ్రామ సచివాలయ కన్వీనర్ చెరుకురి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు ఎంపికపై హర్షం

పిఠాపురం: దేశ రాజధాని న్యూఢిల్లీలో బుధవారం జరిగిన బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎన్నికల్లో ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ నాయకులు ఎన్నిక కావడం పట్ల జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ నాయకులు చంగలరాయ నాయుడు, జి.చక్రవర్తి బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు ట్రెజరర్, సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైనట్లు జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ నాయకులు బొజ్జా మానిక్యాలరావు తెలిపారు. వారి ఎంపిక పట్ల ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కొత్తెం సుందరకుమార్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

'సురక్ష'తో అర్హులందరికీ పథకాలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గ్రామాల్లో ఉత్సాహంగా 'జగనన్న సురక్ష'



గొల్లప్రోలులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు



ఉప్పాడలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు



జగనన్న సురక్ష కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్



సామర్లకోటలో సర్టిఫికెట్లు అందజేసిన చైర్‌పర్సన్, కౌన్సిలర్

పిఠాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ 3వ వార్డు సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజా సంక్షమమే పరమావధిగా పని చేస్తున్నారన్నారు. ఇప్పటికే 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారన్నారు. ఎవరైతే అర్హత కలిగి ఉండి ఇంకా ప్రభుత్వ పథకాలు అందుకోవడం లేదో వారిని గుర్తించి పథకాలు అందించేందుకు సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నగర పంచాయతీ కమిషనర్ సత్యానారాయణ, ఎంపీడీఓ శర్మ, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అందరూ సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష ప్రవేశపెట్టారని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్థానిక 3వ సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వార్డు కౌన్సిలర్, స్థానికుల ఫిర్యాదు మేరకు 3వ సచివాలయం అడ్మిన్ నాగేంద్ర పని తీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందాలనే లక్ష్యంతో వలంటీరు, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసే ఇప్పుడు కూడా ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. పని చేయడం ఇష్టం లేకపోతే మరో ప్రాంతానికి బదిలీ చేయించుకోవాలని వైస్‌చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికేట్లు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైస్ చైర్మన్ గోకిన సునేత్రదేవి, కౌన్సిలర్లు రెడ్డి లోవకుమారి, పిట్టా సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ ఆర్ శ్రీనివాసరావు, జగనన్న సురక్ష పట్టణ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలు తీర్చేందుకే..

పెద్దాపురం: ప్రజల అవసరాలు గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్షకు శ్రీకారం చుట్టిందని మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి అన్నారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర అధ్యక్షతన జరిగింది. పేదలకు అందుబాటులో ఎటువంటి రుసుము లేకుండా జగనన్న సురక్ష ద్వారా సేవలందించడం జరుగుతుందన్నారు. టీపీఓ ఉమామహేశ్వరావు, కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెళ్ళి వీర్రాఘవులు, ఆకుల కృష్ణ బాపూజీ తదితరులు పాల్గొన్నారు. వాలుతిమ్మాపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా ప్రారంభించారు. తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీఓ అశోక్‌కుమార్, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, ఈఓ పీఆర్డీ మూర్తి పంచాయతీ కార్యదర్శి వరసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్ సూచించారు. మండలంలోని ఉప్పాడ-2 గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. 380 దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 99 శాతం ప్రజలకు ఇప్పటికే సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మిగిలిన ఒక్క శాతం మందికి లబ్ధి చేరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్రహం లింకన్, తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల విస్తీర్ణం పెంచాలి

- జేడీ విజయకుమార్



సామర్లకోటలో కూరగాయల సాగును పరిశీలిస్తున్న జేడీ, ఏఓలు

సామర్లకోట: జిల్లాలో చిరు ధాన్యాల విస్తీర్ణం పెరిగేలా వ్యవసాయాధికారులు శ్రద్ధ చూపాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.విజయకుమార్ అన్నారు. స్థానిక టీటీడీసీలో బుధవారం ప్రకృతి వ్యవసాయాధికారులు, సిబ్బందితో ఒక రోజు శిక్షణలో ఆయన పాల్గొన్నారు. అపరాల కొరతను తీర్చేలా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. కిర్లంపూడి రోడ్డులోని పెరటి తోటల పెంపకం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, మండల విస్తరణాధికారి ఎంపీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పీబీ దేవంలో 413 సర్టిఫికెట్లు అందజేత



పీబీ దేవంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేసిన ఎంపీడీఓ తదితరులు

సామర్లకోట: మండల పరిధి పీబీ దేవం గ్రామ సచివాలయ పరిధిలో దరఖాస్తుదారులకు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జగనన్న సురక్షలో భాగంగా 413 సర్టిఫికెట్లు అందజేసినట్టు ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఉప సర్పంచ్ మలకల సత్య, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు మలకల వరాలబాబు తదితరులు పాల్గొన్నారు.

'రిలయన్స్' సేవలు సద్వినియోగం చేసుకోవాలి



పశువులకు మందులను పంపిణీ చేస్తున్న గోవిందు, డాక్టర్ నవీన్

పెద్దాపురం: రైతులు రిలయన్స్ ఫౌండేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లల గోవిందు అన్నారు. మండలంలోని కట్టమూరులో పశుసంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ మేనేజర్ బర్రే నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా వైఎస్సార్ పశు బీమా ప్రవేశపెట్టిందన్నారు. రైతులు భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గోవిందు కోరారు. బర్రే నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో రిలయన్స్ ఫౌండేషన్ మరిన్ని సేవలందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అనంతరం సుమారు 35 మంది రైతులకు చెందిన 290 పశువులకు ఉచిత పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కాండ్రకోట పశువైద్యాధికారి నవీన్‌తో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయ ట్రస్ట్ బోర్డు సమావేశం



సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న చైర్మన్ రమేష్‌బాబు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయ సిబ్బంది తీరుపై ట్రస్టు బోర్డు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఆలయంలో ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. ఆషాఢమాసం సందర్భంగా ఈనెల 16న ఆదివారం, స్వామి వారి ఆరుద్ర నక్షత్రం రోజున శాకాంబరి అలంకరణ చేయాలని ట్రస్టు బోర్డు నిర్ణయించింది. ఆలయ కోనేరులో జరుగుతున్న పనులపై ట్రస్టు బోర్డు సభ్యులు ప్రశ్నించారు. కోనేరులో పూడిక తీత పనులు పూర్తి చేశారని, మరో వారం రోజులలో కోనేటిని ఇసుకతో నింపుతామని పురావస్తుశాఖ అధికారులు చెప్పినట్టు ఈఓ డి నాగమల్లేశ్వరరావు సభ్యులకు తెలిపారు. అనంతరం గోదావరి జలాలతో కోనేటిని నింపుతామని ఆయన తెలిపారు. ఆలయ ప్రసాదానికి సంబంధించి లెక్కలు సరిగా లేకపోవడంతో సూపరింటెండెంట్ ఈశ్వరరావు పని తీరును తప్పుపట్టారు. ఆ వివరాలను ఎందుకు నమోదు చేయడం లేదని చైర్మన్ రమేష్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నెల ఒకే రకమైన ఖర్చులు ఉండాల్సి ఉండగా తేడాలు ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తీర్మానం చేశారు. ఆలయంలో పని చేసే సిబ్బంది నిత్యం డ్రెస్ కోడ్ అమలు చేసేలా యూనిఫారం ఉన్నా దానిని ధరించడకపోవడంపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. ట్రస్టు బోర్డు కోఆప్షన్ సభ్యుడు కొంతేటి జోగారావు, అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, భక్త సంఘం సభ్యులు బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తికి జైలు

పిఠాపురం: ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసిన వ్యక్తికి 6 నెలల జైలు శిక్ష రూ.10 వేల జరిమానా విధిస్తూ పిఠాపురం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎంఎల్ సాయిసుభాష్ బుధవారం తీర్పు చెప్పారు. పిఠాపురం రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. పిఠాపురం మండలం విరవకు చెందిన సింగినీడి దివ్యరుషి ఆశా వర్కర్ ఉద్యోగం కోసం కాకినాడ వైద్యారోగ్య శాఖ కార్యాయంలో దరఖాస్తు చేసుకుంది. విషయం తెలుసుకున్న విజయనగరం జిల్లా జొన్నాడ చింతల వలసకు చెందిన దొప్పా రవికుమార్ ఆమెకు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. ఉద్యోగం కావాలంటే కొంత సొమ్ము ముట్టజెప్పాలని కోరాడు. దీంతో ఆమె అతనికి రూ.60 వేలు ఇచ్చింది. డబ్బు తీసుకుని ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగం రాక పోయే సరికి అతడిని అడగడానికి ప్రయత్నించగా అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన ఆమె పిఠాపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పిఠాపురం రూరల్ ఎస్సై అబ్దుల్ నబీ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. వాదోపవాదాల అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో 6 నెలల జైలు శిక్ష రూ.10 వేల జరిమానా విధిస్తూ పిఠాపురం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎంఎల్ సాయి సుభాష్ తీర్పు చెప్పారు. జరిమానా కట్టలేని పక్షంలో మరో రెండు నెలలు జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు.

కాలువలకు జలకళ



గోకవరం శివారున పంట కాలువలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

గోకవరం: స్థానిక ఊరకాలువ, బురదకాలువ, పంట కాలువలు బుధవారం వరద నీటితో కళకళలాడాయి. మంగళవారం రాత్రి మండలంతో పాటు ఏజెన్సీలో కురిసిన భారీ వర్షానికి కాలువల్లో నీరు ప్రవహించింది. గోకవరం శివారున దేవీపట్నం ఆర్అండ్ఆర్ కాలనీకి వెళ్లే మార్గంలో పంట కాలువ సప్టా పైనుంచి ఉధృతంగా నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే పంట కాలువ పొంగడంతో సమీపంలోని నారుమడులు నీటమునిగాయి.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

కొత్తపల్లి: గొర్స గ్రామంలోని సాయినగర్‌లో ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని బుధవారం విజిలెన్స్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యాన్ని పిఠాపురంలోని స్టాక్ పాయింట్‌కు తరలించారు. వాటిని నిల్వ ఉంచిన పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడుకు చెందిన పిండి సోమరాజుపై కేసు నమోదు చేశారు.